సాక్షి
పల్నాడు

7

శనివారం, 21, డిసెంబర్, 2024



ఎస్‌బీఐ ఎండీ అమరా మనవాడే

చినగంజాం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎండీగా మన తెలుగువ్యక్తి అమరా రామమోహన రావు నియమితుల య్యారు. ఆయనకు బాపట్ల జిల్లా చినగంజాంతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన దగ్గర బంధువు అమరా మోహన రావు అందించిన వివరాల ప్రకారం.. అమరా రామమోహనరావు తండ్రి రంగనాయకులు, తల్లి సామ్రాజ్యం. ప్రస్తుతం ఆమె చనిపోయారు. తండ్రి గతంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఉద్యోగరీత్యా చీరాలలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో రామ మోహన్ జన్మించారు. ప్రస్తుతం రంగనాయకులు తెనాలిలోని కొత్తపేటలో ఉంటున్నారు. ఆయనకు కుమారుడు రామమోహన్, కుమార్తె ఉష ఉన్నారు. వారికి గతంలో చినగంజాంలో సొంత ఇల్లు ఉండేది. 20 ఏళ్ల క్రితం రంగనాయకులు తండ్రి చనిపోవడంతో దానిని అమ్ముకొని వెళ్లిపోయారు. రామమోహన్ చదువుకునే రోజుల్లో చినగంజాం అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవారని మోహనరావు వివరించారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని బలంగా నమ్మిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో విద్యారంగానికి పెద్దపీట వేశారు. పేద బిడ్డల బంగారు భవితకు బాటలు వేశారు. వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మనబడి నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. ప్రతి బిడ్డ బడికి వెళ్లాలనే ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని దిగ్విజయంగా అమలు చేశారు. ఏటా పుస్తకాలు, యూనిఫాం, షూతో కలిపి మొత్తం 10 రకాల వస్తువులతో విద్యాకానుక అందించారు. పేదింటి బిడ్డ దొరబాబులా ఇంగ్లీషు మీడియం చదవాలని బలంగా ఆకాంక్షించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆ దిశగా అడుగులు ముందుకు వేశారు. ఏటా తన పుట్టిన రోజునే విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేశారు. వారి మధ్యనే గడిపేవారు. పేద చిన్నారుల మోముల్లో చిరునవ్వులు చూసి మురిసిపోయేవారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ సంస్కరణలకు తూట్లు పొడుస్తోంది. ఫలితంగా వైఎస్ జగన్ హయాంలో జరిగిన మేళ్లు నిత్యం గుర్తుకొస్తూనే ఉన్నాయి.

- చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని బలంగా నమ్మిన వైఎస్ జగన్
- విద్యారంగంలో వినూత్న సంస్కరణలకు శ్రీకారం
- పుట్టిన రోజునే 8,9,10 తరగతుల విద్యార్థులకు రూ.130 కోట్లతో 42,682 ట్యాబ్‌ల పంపిణీ
- నాడు–నేడు ద్వారా రూ.472.6 కోట్లతో ప్రభుత్వ బడులకు మహర్దశ
- అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు రూ.977.45 కోట్లు పంపిణీ
- 1,80,089 మంది విద్యార్థులకు ఏటా విద్యా కానుక
- కూటమి పాలనలో ఆగిన విద్యా సంస్కరణలు
- జగనన్న పాలనను నిత్యం గుర్తుచేసుకుంటున్న జిల్లా వాసులు

సువర్ణ స్వాప్నికుడి అక్షర యజ్ఞం

విద్యా రంగాన జగన్నినాదం • నేడు జననేత పుట్టిన రోజు

సాక్షి, నరసరావుపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రి అయ్యే వరకు ప్రభుత్వ పాఠశాలలు కనీస వసతులు లేక కూనారిల్లుతుండేవి. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఉండేవి కావు. భవనాలు కూలిపోయే స్థితిలో ఉండేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అన్ని మౌలిక వసతులను కల్పించారు. డిజిటల్ విద్యను ప్రవేశపెట్టారు. అధునాతన ఫర్నిచర్‌తో పాఠశాలలకు కొత్త శోభను తీసుకొచ్చారు. ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టి నాణ్యమైన





బాపట్ల జిల్లాలోని విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో నాడు-నేడు ద్వారా ముస్తాబైన తరగతి గది

విద్యను అందించారు. జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలను క్రమం తప్పకుండా అమలు చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే విద్యార్థులకు ఓ మేనమామలా జగన్ అన్నీ సమకూర్చి వారి విద్యకు భరోసానిచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థను గాలికి వదిలేసింది. జగన్ తెచ్చిన సంస్కరణలన్నింటినీ చంద్రబాబు ప్రభుత్వం పక్కనపెట్టేసింది. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

పాఠశాల తెరిచిన రోజే పుస్తకాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా పాఠశాలలు తెరిచే రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, షూస్, బ్యాగ్ వంటి 10 రకాల విద్యా సంబంధ వస్తువులు అందించారు. జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరానికి 1,80,089 మంది విద్యార్థులు విద్యాకానుక అందుకున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడంతో సరిపెట్టకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా ప్రణాళికలతో జగన్ ముందడుగు వేశారు. ప్రాథమిక విద్య 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, ఆరో తరగతి నుంచి డిజిటల్ క్లాస్ రూములను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ అటకెక్కించింది.

ట్యాబ్‌లతో పేద బిడ్డలు దొరబాబుల్లా..

గత ప్రభుత్వంలో డిసెంబర్ 21న 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందజేశారు. జిల్లాలో రెండు విడతల్లో మొత్తం 42,682 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు సుమారు రూ.130 కోట్లతో ట్యాబ్‌లను అందించారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలేవీ తీసుకోలేదు.

అమ్మఒడి ఓ అద్భుతం

జగనన్న అమ్మఒడి పథకం ద్వారా పిల్లలను బడికి పంపే ప్రతి తల్లి బ్యాంక్ ఖాతాలో ప్రతి ఏడాది రూ.15వేలు జగన్ జమ చేశారు. పల్నాడు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రూ.977.45 కోట్ల రూపాయలను తల్లుల ఖాతాలోకి నేరుగా జమ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంట్లో ఎంతమంది బడికి వెళ్లే పిల్లలుంటే అంతమందికి ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఆరునెలలైనా దాని ఊసే ఎత్తడం లేదు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు బడిలో మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించారు. వారంలో ఐదు రోజులపాటు భోజనంతోపాటు కోడిగుడ్డు, మూడురోజులు చిక్కీలు, మూడు రోజులు రాగిజావ అందించారు. ప్రస్తుతం ఆ పథకం సరిగా అమలుకు నోచుకోక విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా జరిగిన పనుల వివరాలు

విభాగాలు	పాఠశాలలు	మొత్తం(రూ.కోట్లలో)
ఫేజ్-1	623	149.85
ఫేజ్-2	907	306.95
ఫేజ్-2ఏ		11.00
ఫేజ్-2బి	513	4.80

జగనన్న హయాంలో అమ్మఒడి పథకం లబ్ధిదారులు ఇలా..

విద్యా సంవత్సరం	లబ్ధిదారులు	జమ అయిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	1,61,031	241.55
2020-21	1,72,772	241.88
2021-22	1,92598	250.38
2022-23	1,87,417	243.64
మొత్తం		977.45

పల్నాడు జిల్లాలో పంపిణీ చేసిన ట్యాబ్‌ల సంఖ్య ఇలా..

మొదటి విడతలో విద్యార్థులకు ఇచ్చినవి 21,820

ఉపాధ్యాయులకు అందించినవి - 2,348

రెండో ఏడాది విద్యార్థులకు ఇచ్చినవి - 18,169

ఉపాధ్యాయులకు పంపిణీ చేసినవి - 345

మనబడి నాడు-నేడుతో నవశకం

మనబడి నాడు-నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దటంతోపాటు అన్ని రకాల వసతులను జగన్ కల్పించారు. ప్రతి తరగతి గదిలో కార్పొరేట్ స్థాయి బల్లలు, బ్లాక్‌బోర్డు, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. డిజిటల్ క్లాస్‌రూమ్‌లను నూతనంగా నిర్మించి నాణ్యమైన విద్యను అందించారు. పరిశుభ్రంగా మరుగుదొడ్లు, శుద్ధి చేసిన తాగునీటి వసతి కల్పించారు. వెలిసిపోయి బీటలు వారిన పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. విజ్ఞానం, వినోదం కలసి వచ్చేలా రంగురంగులతో బొమ్మలు వేయించారు. విశాలమైన అదనపు గదులను నిర్మించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.472.6 కోట్లతో మనబడి నాడు-నేడు పనులు జరిగాయి. 1,420 తరగతి గదులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, మరో 474 తరగతి గదులలో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ బోధనను అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నాడు-నేడు పనులను అర్ధాంతరంగా ఆపేసింది. జగన్ హయాంలో క్రమం తప్పకుండా జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాల నగదును బటన్ నొక్కి నేరుగా తల్లుల ఖాతాలలో జమ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పథకాలకు పేర్లను మార్చి అమలు చేయకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తోంది.

జగన్ హయాంలో అంతర్జాతీయ స్థాయికి ప్రభుత్వ విద్యారంగం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు ఇచ్చిన ప్రాధాన్యం అందరికీ తెలుసు. విప్లవాత్మకమైన పథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెట్టి పేదింటి పిల్లల విద్యకు భరోసానిచ్చారు. మనబడి నాడు–నేడు, డిజిటల్ విద్య, టోఫెల్, ఇంగ్లిషుమీడియం ద్వారా పిల్లలకు అంతర్జాతీయస్థాయిలో విద్యను అందించేందుకు జగన్ కృషి చేశారు. పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకునేందుకు అమ్మఒడి లాంటి పథకాన్ని దిగ్విజయంగా అమలు చేశారు.

– ఇ.ఎం.స్వామి, విద్యావేత్త, స్వామి స్కూల్ వ్యవస్థాపకులు, నరసరావుపేట

క్లుప్తంగా

అచ్చంపేటలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు తొలగింపు



అచ్చంపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మది నోత్సవం సందర్భంగా స్థానిక ఆంజనేయ స్వామి విగ్రహ సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలను గురువారం కొంతమంది యువకులు తొలగించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు సందెపోగు పున్నారావు మాట్లాడుతూ ఎవరి పుట్టిన రోజైనా ఇక్కడ ఉన్న మేడకు ఫ్లెక్సీలు కట్టుకుంటారని, అదే తరహాలో జగన్‌పై ఉన్న అభిమానంతో తాను పెద్ద ఫ్లెక్సీ కట్టానని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ టీడీపీ ఫ్లెక్సీలను తాము తొలగించలేదని గుర్తుచేశారు. ఫ్లెక్సీ కట్టిన తరువాత కనీసం ఒక్కరోజు కూడా ఉంచకపోవడం దారుణమన్నారు.

399 రూపాయలకే పోస్టల్ బీమా సౌకర్యం

శావల్యాపురం: పోస్టల్ శాఖలో బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని శావల్యాపురం పోస్టల్ అధికారి జి.హరి కృష్ణ చెప్పారు. శుక్రవారం స్థానిక పోస్టల్ కార్యాలయంలో హరికృష్ణ మాట్లాడుతూ సంవత్సరానికి రూ.399 ప్రీమియం చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. ఈ పాలసీ తీసుకున్న వారు ప్రమాదంలో మరణిస్తే రూ.10 లక్షలు వారి కుటుంబానికి వస్తాయని వివరించారు. శాశ్వతంగా వైకల్యానికి గురైతే రూ.10 లక్షలు బీమా వస్తుందన్నారు. 18 నుంచి 65 ఏళ్లలోపు వారందరూ ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. మెడికల్ అలవెన్స్ నిమిత్తం రూ.60 వేలతో పాటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఉంటే 10 రోజులు ఉంటే రోజుకు రూ.1,000 చొప్పున పోస్టల్ శాఖ ద్వారా మంజూరవుతాయని వివరించారు. పోస్టల్ కార్యాలయంలో రూ.200 రూపాయలతో ఖాతా ప్రారంభిస్తే ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమవుతాయన్నారు. పోస్టల్ ఖాతా కలిగి ఉంటే ఆధార్ బయోమెట్రిక్ విధానంలో నగదు తీసుకునే విధానం అమల్లో ఉందన్నారు.

రెవెన్యూ సదస్సులో అర్జీలకు పరిష్కారం చూపాలి

- జనవరి 15 నుంచి జిల్లాలో రీ సర్వే ప్రక్రియ ప్రారంభం
- కలెక్టర్ అరుణ్‌బాబు
- సత్తెనపల్లి, భృగుబండ గ్రామాల్లో పర్యటన

సత్తెనపల్లి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు చెప్పారు. సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చే ప్రతి అర్జీని 15 రోజుల్లో పరిష్కరించాలని, ఒకవేళ పరిష్కారం కాకుంటే కారణం తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు చుక్కల భూముల సమస్యపై కలెక్టర్‌కు వివరించారు. దీనికి స్పందించిన కలెక్టర్ జనవరి 15 నుంచి జిల్లాలో రీ సర్వే ప్రక్రియ ప్రారంభం కాబోతుందని, ఆ సర్వేలో పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఇంకా పలువురు చెప్పిన సమస్యలను సావధానంగా విన్నారు. గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. టెన్త్ యాక్షన్ ప్లాన్‌పై మాట్లాడారు. సత్తెనపల్లి వెంకటపతి నగర్ ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. హాస్టల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ జీవీ రమణకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి సూచించారు. కార్యక్రమాల్లో డీఈఓ చంద్రకళ, డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, ఐసీడీఎస్ పీడీ సీహెచ్ ఉమాదేవి, పంచాయతీరాజ్ డీఈ శేఖర్‌బాబు, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ఏపీడీ పి.వెంకట నారాయణ, ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బోసుబాబు, పంచాయతీరాజ్ ఏఈ కె.రామ్మోహన్ సింగ్, ఎస్సీ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం సంక్షేమ అధికారిణి పాలెపోగు సుమణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.



బృగుబండ గ్రామంలో సీసీ రోడ్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

- ఎస్పీ శ్రీనివాసరావు హితవు
- పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాల్లో మరణాలు నివారించాలంటే హెల్మెట్ వినియోగం తప్పనిసరి కావాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. హెల్మెట్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం జిల్లా పోలీసు విభాగం ఆధ్వర్యంలో డీఎస్పీ కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో డివిజన్ పోలీసులు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్ మీదుగా పోలీసు ప్రధాన కార్యాలయం వరకు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి అంటూ బ్యానర్లు ప్రదర్శించారు. ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని, ఇక ఉపేక్షించబోమని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్, వాహనాలు నడిపే మైనర్లు, కార్లలో సీట్ బెల్ట్ పెట్టుకోని వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని వెల్లడించారు. డీఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాణాలను కాపాడటంలో హెల్మెట్ పాత్ర ఎంతో ముఖ్యమైందని, తలకు ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని చెప్పారు. అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు, ట్రాఫిక్ సీఐ లోకనాథం, సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

అధికారులతో బాధిత రైతులు

దాచేపల్లి: అకాల వర్షానికి తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం గురువారం తెల్లవారుజామున అకాల వర్షానికి తడిసింది. దీంతో ఈ ధాన్యాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి పాపకుమారి శుక్రవారం పరిశీలించారు. నష్టపోయిన రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు శ్రీనివాసరావు, సాంబశివరావు, గోపి ఏఓ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని చెప్పారు. తడిచిన ధాన్యం ఆరబెట్టేందుకు, బస్తాల్లో నింపేందుకు ఎకరానికి రూ.15 వేల నుంచి రూ. 20 వేలు ఖర్చు అవుతుందని వివరించారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు కోరారు. తేమ శాతం 17 ఉంటే ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తోందని, 75 కేజీల బస్తాకు రూ. 1,700లు, వంద కేజీల బస్తాకు రూ.2,300 చొప్పున చెల్లిస్తుందని ఏఓ పాపకుమారి తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలంటే సంబంధిత రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకుని ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. బాధిత రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళతామని తెలిపారు.



ఏఓ పాతకుమారితో మాట్లాడుతున్న రైతు

హేతుబద్ధంగా పెండింగ్ కేసుల తగ్గింపు



నేరసమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు, చిత్రంలో అదనపు ఎస్పీలు



నేరసమీక్షకు హాజరైన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు

నేర సమీక్షలో ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షలో స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, దర్యాప్తు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో పోలీసులు మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని చెప్పారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ, మిస్సింగ్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, వేగ నియంత్రకాలు, ట్రాఫిక్ సూచనలను తెలిపే సైన్ బోర్డులను, అవసరమైన చోట స్టాప్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఎస్పీ చెప్పారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని చెప్పారు. 112 ఎమర్జెన్సీ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ సీహెచ్. లక్ష్మీపతి, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, జగదీష్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

గురజాల: పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎద్దుల బల ప్రదర్శన పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆఖరి రోజు జరిగిన నాలుగు పళ్ల విభాగం పోటీలను పులుకూరి కాంతారావు ప్రారంభించారు. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కాజీపురం గ్రామానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి ఎడ్ల జత 4780.7 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం కోండేపాడుకు చెందిన చాగంటి శ్రీనివాసరావు చౌదరి ఎడ్ల జతలు 4,600 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందనకు చెందిన నీలం నరసింహారావు, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెంకు చెందిన రామినేని రత్తయ్య చౌదరి ఎడ్ల జతలు 4230.10 అడుగులల లాగి మూడో బహుమతిని గెలుచుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట మండలం మేళ్లచెరువుకు చెందిన వీరంరెడ్డి కార్తీక్ రెడ్డి ఎడ్ల జత 4024.8 అడుగులు దూరం లాగి నాలుగో బహుమతిని, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన పద్మానాయుడు ఎడ్ల జత 3933.3 అడుగులు దూరం లాగి ఐదో బహుమతిని దక్కించుకున్నాయి.

సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కాంతారావు!

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడికాలువ ఆయకట్టు పరిధిలోని నీటిసంఘాలకు జరిగిన ఎన్నికల్లో చివరి అంకమైన ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల చేసినట్లు నోడల్ ఆఫీసర్, ఎన్ఎస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్ తెలిపారు. కాగా, క్యాబినెట్ ర్యాంకు ఉన్న చైర్మన్ పదవికి జిల్లాలోని ముగ్గురు టీడీపీ నాయకులు పోటీ పడగా గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు సహచరుడైన మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావును ఎంపిక చేసినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అయితే అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈనెల 13న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాగా, 14వ తేదీన వాటర్ యూజర్స్ అసోసియేషన్ (డబ్ల్యుయుఏ), 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలు(డీసీ)లకు ఎన్నిక నిర్వహించారు. ఈ డీసీలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికైన వారు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోనున్నారు. ప్రతిపక్షమైన వైఎస్సార్ సీపీ ఈ ఎన్నికలను బహిష్కరించటంలో టీడీపీ వర్గీయులకే పదవులు లభించనున్నాయి. కుడికాలువ పరిధిలోని పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో 32 డీసీలు ఉండగా అందులో 25 డీసీలు పల్నాడు డివిజన్‌లో ఉన్నాయి. దీంతో చైర్మన్ పదవి పల్నాడు వాసులకే దక్కటం ఆనవాయితీగా వస్తోంది. ప్రకాశం జిల్లా వాసులకు వైస్ చైర్మన్ పదవి లభించనుంది.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 లారీలు స్వాధీనం

పెదకూరపాడు: ఇసుక అక్రమదారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఈ నెల 10వ తేదీన ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని రాష్ట్ర విజిలెన్స్ డీజీ ఆదేశాల మేరకు.. పల్నాడు జిల్లా విజిలెన్స్ అధికారులు కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అచ్చంపేట మండలం అంబడిపూడి ఇసుక రీచ్ వద్ద నదీ గర్భంలోకి వెళ్లి ఐదు పొక్లెయినర్లు అక్రమంగా ఇసుకను మూడు లారీల్లో లోడు చేస్తుండగానే పట్టుకున్నారు. అదే రోజు అమరావతి మండలం మల్లాది ఇసుక రీచ్ వద్ద భారీ పొక్లెయినర్లతో ఇసుక లోడ్ చేస్తుండగా విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఆయా యంత్రాలను, లారీలను అమరావతి, అచ్చంపేట పోలీస్ స్టేషన్లకు అప్పగించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పెదకూరపాడు మండలం గారపాడు, హుస్సేన్ నగర్ గ్రామాల మధ్య సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మల్లాది రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 13 లారీలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎలాంటి బిల్లులు లేవని గుర్తించినట్లు డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. పలు లారీల డ్రైవర్లు లారీలను వదిలి పెట్టి పరారైనట్లు తెలిపారు. పట్టుబడిన లారీలను పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నామని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జూనియర్ జిల్లా జట్టు ఎంపిక

చినగంజాం: జూనియర్ బాల, బాలికల స్టేట్ చాంపియన్‌షిప్ కబడ్డీ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ క్రీడాకారుల జట్టు ఎంపిక కార్యక్రమం స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈనెల 15వ తేదీ జూనియర్ కబడ్డీ బాలుర జట్టు కోసం క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. జట్టును ఎంపిక చేసి 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, జిల్లా కబడ్డీ కోచ్ ఎం గిరిబాబు నిర్వహించారు. శిక్షణ అనంతరం రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనేందుకు తుది జట్టు ఎంపిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న 50వ ఆంధ్ర జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం గ్రామంలో నిర్వహించనున్నారు. ఎంపికైన జట్టు క్రీడాకారులకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు (ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్) క్రీడాదుస్తులు, శిక్షణ కాలంలో భోజన సదుపాయం అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పూర్ణచంద్రరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, ట్రెజరర్ రమేష్‌లు హాజరయ్యారు. వారితో పాటు కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ ఆట్ల స్వామిరెడ్డి, ముసలారెడ్డి, పలపట్ల పోలిరెడ్డి, బోగిరెడ్డి నాగాంజనేయులు, బోగిరెడ్డి శివారెడ్డి, కోట చక్రధర్ రెడ్డి, నిదర శ్రీనివాసరెడ్డి, వాటంబేటీ రాజేష్, పిట్టు బాలకృష్ణారెడ్డి, దేశం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ బాలుర జట్టు..

ఎస్ మణిరెడ్డి (కెప్టెన్), జీ రామకృష్ణ, జీ లక్ష్మణ్, జీ బాలాజీ, ఏ అశోక్, కే సాయిరాం, జీ మల్లికార్జునరెడ్డి, ఎం సోమేష్, కే ఆకాష్, బీ భవానీశేఖర్, డీవీ మాధవ్, ఏ వెంకీ, పీ బాలకృష్ణారెడ్డి (టీం మేనేజర్), ఎం గిరిబాబు (కోచ్).



ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టు

22న జిల్లా అండర్–19 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

చెరుకుపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–19 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని బాపట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కందుల వెంకటేశ్వరరావు, దుండి నల్లిరెడ్డి తెలిపారు. గుళ్లపల్లి హైస్కూల్లో శుక్రవారం వారు మాట్లాడుతూ ఈనెల 22న గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 9గంటల నుండి బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. వీటిలో ఎంపికైనవారు జనవరి 3నుంచి 5వ తేదీ వరకు కర్నూలులో జరిగే 50వ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని, అక్కడ రాష్ట్రస్థాయిలో జట్టు ఎంపిక జరుగుతుందని, అక్కడ ఎంపికైనవారు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా జట్టు ఎంపికలో పాల్గొనే వారు, 19సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని, బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీల లోపు బరువు కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ 9000042705, 7893075105, 8096024969, 9989348699 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.నాగాంజనేయులురెడ్డి, ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు

చినగంజాం: బాపట్ల జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఖాజీపాలెంలోని కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరుగుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డి తెలిపారు. కాలేజీ ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీలలో పాల్గొనే పురుషులు 10 కి.మీ, మహిళలు 10 కి.మీ, అండర్–20 అబ్బాయిలు 8 కి.మీ, అండర్–20 అమ్మాయిలు 6 కి.మీలు, అండర్–18 బాలురు 6 కి.మీ, బాలికలు 4 కి.మీలు, అండర్–16 బాలురు 2 కి.మీ, బాలికలు 2 కి.మీలు లక్ష్యాన్ని పరుగెత్తాల్సి ఉంటుంది. మొదటి మూడు స్థానాలు సాధించిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డు లేదా వయస్సు ధ్రువీకరణ పత్రం, ప్రతి అథ్లెట్‌కు ఒక వయస్సులో ఒక ఈవెంట్ మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు మరిన్ని వివరాల కోసం 22వతేదీ 6 గంటలకు వేదిక వద్దకు రావాలని ఆయన కోరారు.

ఆర్టీసీకి ఇంధన పొదుపు అవార్డులు

సాక్షి, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీ 2024 రాష్ట్ర ఇంధన పొదుపు మిషన్ అవార్డులను సాధించింది. బస్ డిపో విభాగంలో సత్తెనపల్లి డిపోకు గోల్డ్ కేటగిరీ, బస్ స్టేషన్ విభాగంలో విశాఖపట్నం బస్ స్టేషన్ సిల్వర్ కేటగిరీ అవార్డులు దక్కించుకున్నాయి. అవార్డులు సాధించిన ఆర్టీసీ డిపో, బస్ స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు శుక్రవారం అభినందించారు.

యార్డులో 53,675 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 46,813 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 53,675 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. ఇంకా యార్డులో ఇంకా 44,415 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు.

జాతీయ రైఫిల్ షూటింగ్‌లో ముఖేష్‌కు స్వర్ణం



గుంటూరు వెస్ట్: ఢిల్లీలో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 67వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ స్వర్ణం సాధించాడని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ డైరెక్టర్ ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో 600 పాయింట్లకు గాను 588 పాయింట్లు సాధించాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖేష్ పుణేలో ఒలిపిక్ పతక విజేత గగన్‌నారంగ్ వద్ద శిక్షణ పొందుతున్నాడని చెప్పారు. ముఖేష్‌కు ఏపీ రైఫిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సలలిత్, రాజ్‌కుమార్, కేఎల్‌యూ స్పోర్ట్స్ డీన్ హరికిషన్‌లు అభినందనలు తెలిపారు.

కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ మధ్యవర్తిత్వం

నగరంపాలెం: మధ్యవర్తిత్వం పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై జిల్లా కోర్టు ఆవరణలోని డీజే హాల్‌లో నిర్వహిస్తోన్న నలభై గంటల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ సమస్య పరిష్కారంలో కక్షిదారులే కీలక పాత్రధారులని అన్నారు. న్యాయమూర్తులకు శిక్షణ ఇచ్చిన ఆర్.రత్నతార, సత్యరావు (తమిళనాడు)లను సత్కరించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి, న్యాయమూర్తులు పాల్గొన్నారు.



న్యాయమూర్తులతో జిల్లా జడ్జి, సంస్థ కార్యదర్శి లీలావతి తదితరులు

ప్రైవేట్ హాస్టల్‌లో అపశ్రుతి

వేడి పాలు మీద పడి బాలుడికి గాయాలు

చినగంజాం: వేడి పాలు మీద పడి ఒక బాలుడు గాయాలపాలయ్యాడు. ఈ ఘటన చినగంజాం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో హార్ట్స్ చారిటబుల్ ట్రస్ట్ అనే ప్రైవేట్ హాస్టల్‌ను దాసరి మోహన్‌రావు నిర్వహిస్తున్నాడు. హాస్టల్‌లో ఉంటూ చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పావులూరి వినోద్‌కుమార్ శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో హాస్టల్‌లోని ఆయా పాలు వేడిచేసుకొని పిల్లలకు ఇచ్చేందుకు వస్తోంది. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన బాలుడు వినోద్‌కుమార్ తగలడంతో వేడి పాలు అతడిమీద పడి నడుం దగ్గర తీవ్రంగా కాలి గాయాలపాలయ్యాడు. గాయాలపాలైన అతనిని చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం తరలించినట్లు సమాచారం. సమాచారాన్ని బాలుడి తల్లిదండ్రులు పావులూరి మరియదాసు, లలితకు ఫోన్‌లో సమాచారం అందించారు. చినగంజాంలో నడుపుతున్న హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉంటూ స్థానికంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నట్లు సమాచారం.

జ్వరంతో చిన్నారి మృతి



అద్దంకి రూరల్: జ్వరంతో బాధపడుతూ చిన్నారి గురువారం మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అద్దంకిలోని గాజులపాలేనికి చెందిన కే వర్షిని (10) గాజులపాలెంలోని ఎంపీయూపీ పాఠశాలలో 5 వతరగతి చదువుతోంది. గురువారం జలుబు, దగ్గు, ఆయాసంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు కొరిశపాడు మండలంలోని రావినూతలలో ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అదే రోజు సాయంత్రం జ్వరం తీవ్రం వచ్చి ప్రాణాలు విడిచింది. పాఠశాలలో, ఇంటి వద్ద ఎంతో చలాకీగా తిరుగుతూ ఆడుతూ ఉండే పాప మృతిచెందడటంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: మహా కుంభమేళా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఈ విషయం తెలిపారు.

- నంబర్ 07701 గుంటూరు – ఆజంగడ్ రైలు జనవరి 25వ తేదీన, 07702 ఆజంగడ్ – గుంటూరు రైలు 26న నడపనున్నట్లు తెలిపారు. గుంటూరు, కృష్ణా కెనాల్, విజయవాడ, కొండపల్లి, ఖమ్మం, వరంగల్, రామగుండం, మంచిర్యాల, కాగజ్‌నగర్, బలార్షా, చంద్రాపూర్, నాగపూర్ మీదుగా ఇవి ప్రయాణించనున్నాయి.
- నంబర్ 07719 గుంటూరు – గయా రైలు జనవరి 25వ తేదీన, 07720 గయా – గుంటూరు రైలు 27న నడవనున్నాయి. గుంటూరు, విజయవాడ, కొండపల్లి, మధిర, ఖమ్మం, డోర్నకల్ జంక్షన్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, బలార్షా, చంద్రాపూర్, నాగ్‌పూర్ మీదుగా ఇవి రాకపోకలు సాగించనున్నాయి.